పంట కాలువల్లోనే చెత్త డంపింగ్

- రెగ్యులేటర్ల వద్ద పేరుకుపోతున్న చెత్తాచెదారం
- వ్యాధుల బారిన పడుతున్నామంటున్న శివారు గ్రామస్తులు


లోసరి ఛానల్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలతో పేరుకుపోయిన దృశ్యం


పంటకాలువలో చెత్తను తొలగిస్తున్న ఇరిగేషన్ సిబ్బంది

భీమవరం అర్బన్: మండలంలోని కాళీపట్నం చానల్, లోసరి చానల్, ఎల్‌జీపాడు చానల్, అనాకోడేరు పంటకాలువలు భీమవరం పట్టణం మధ్యలో నుంచి రావడంతో పట్టణవాసులు, ఎగువన ఉన్న గ్రామాల ప్రజలు చెత్తను డంపింగ్ చేయడంతో పంట కాలువలు కాలుష్య కోరల్లో చిక్కుకుపోతున్నాయి. ముఖ్యంగా శివారు గ్రామ ప్రజలు ఆ నీటిని తాగి తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ పంట కాలువలు ద్వారా అనాకోడేరు, కొమరాడ, గొల్లవానితిప్ప, దిరుసుమర్రు, యనమదుర్రు, పెదగరువు, తుందుర్రు, రాయలం, చినఅమిరం, కొత్తపూసలమర్రు, లోసరి, దొంగపిండి, తోకతిప్ప, దెయ్యాలతిప్ప పంట పొలాలకు, చేపలు చెరువులకు సాగు నీరు, రక్షిత మంచినీటి చెరువులకు తాగునీరు నింపుతున్నారు. ఈ పంట కాలువల్లో బొంతలు, వాడేసిన స్కూల్ బ్యాగులు, థర్మాకోల్ పెట్టెలు, వ్యర్థాలు, కోళ్ల కళేబరాలు, ప్లాస్టిక్ వస్తువులు నేరుగా డంప్ చేయడంతో కాలువలు వద్ద అవి పేరుకుపోయి దిగువకు నీటి ప్రవాహం ఉండడం లేదు. దీంతో పంట పొలాలకు, చేపలు చెరువులకు సాగు నీరందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా దిగువ గ్రామాల ప్రజలు ఆ నీటిని తాగి తరచూ అనారోగ్యాలకు గురవుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు.

లాకుల వద్ద పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

పంట కాలువల్లో ఏర్పాటు చేసిన రెగ్యులేటర్లు వద్ద చెత్త, చెదారం, ప్లాస్టిక్ పేరుకుపోవడంతో వీటి తీసేందుకు ఇరిగేషన్ అధికారులకు తలకు మించిన భారంగా మారుతుంది. చెత్తను తొలగించేందుకు జేసీబీ, పొక్లెయిన్ సహాయంతో తొలగించాల్సి వస్తుందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఎగువన ఉన్న పట్టణవాసులు, గ్రామస్తులు పంటకాలువల్లో చెత్త వేసే ముందు ఈ నీటిని దిగువ గ్రామస్తులు తాగుతారనే ఆలోచనతో ఉండాలని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ప్రజలు పంటకాలువల్లో చెత్తను వేయకూడదని అధికారులు సూచిస్తున్నారు.

చెత్త వేసే వారిపై కఠిన చర్యలు

పంటకాలువల్లో చెత్త వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వారికి జరిమానా విధిస్తాం. రెగ్యులేటర్లు వద్ద బొంతలు, స్కూల్ బ్యాగులు, ప్లాస్టిక్, థర్మకూల్ బాక్స్‌లు, వాడేసిన వాటర్ బాటిళ్లు కొట్టుకొచ్చి పేరుకుపోతున్నాయి. దీంతో దిగువకు ప్రవాహం తగ్గిపోవడంతో పాటు స్వచ్ఛమైన తాగు, సాగునీరు కలుషితమవుతుంది. ఇదే దిగువ గ్రామాల ప్రజలు తాగుతున్నారనే స్పృహతో ఎగువన ఉన్న పట్టణ, గ్రామస్తులకు ఆలోచించాలి.

– డీహెచ్ వెంకట ప్రసాద రాజు, ఇరిగేషన్ ఏఈ

రైస్ మిల్లుల ధూళిని అరికట్టాలని నిరసన


మిల్లులను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

ఆకివీడు: రైస్ మిల్లుల నుంచి వచ్చే ధూళి, దూగర, ఊక వల్ల నివాస ప్రాంతాల వారికి తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందని ఆ ప్రాంత మహిళలు శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో పరిస్థితిని పరిశీలించేందుకు మిల్లుల వద్దకు వచ్చి తనిఖీ చేశారు. ఊక, దూగర బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఊక గుట్టల్ని తొలగించాలని సూచించారు. దుమ్ము, ధూళిలను అరికట్టకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.రాంబాబు, సందక సూరిబాబు, ఉదయ కుమారి, చొక్కా ధనలక్ష్మి, వరలక్ష్మి, కంచి శ్రీను, బొత్స విమల, శిరీష, శ్యామలరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదల ప్రయోజనాలను విస్మరించిన కూటమి ప్రభుత్వం


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీతారామ్

భీమవరం: కూటమి ప్రభుత్వం పేదల ప్రయోజనాలను విస్మరించి కార్పొరేట్లకు భూముల పంపిణీ విధానాన్ని విడనాడాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారామ్ డిమాండ్ చేశారు. భీమవరంలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం జిల్లా శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వస్తే పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని వాగ్దానం చేశారని అధికారం చేపట్టి ఏడాదిన్నర కావస్తున్న ఇళ్లస్థలాల మాటే ఎత్తడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు సీహెచ్ బాబురావు, బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు తదిరులు పాల్గొన్నారు.

30న సంచార జాతుల స్ఫూర్తి కార్యక్రమం

భీమవరం: సంచార జాతుల విముక్త దినోత్సవాన్ని పురస్కరించుకుని సంచార జాతులం-సదాచార వారసులం, సంస్కృతుల వారధులం అనే నినాదంతో బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదిన ×స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కృష్ణ బలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం భీమవరంలో స్ఫూర్తి కార్యక్రమ కరపత్రాన్ని విడుదల చేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయినం బాలకృష్ణ గౌడ్, జిల్లా అధ్యక్షుడు గున్నేపల్లి పుల్లాజీ, యువమోర్చ సభ్యుడు కంచెర్ల రాజా తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో మందు పిచికారీ

ఆకివీడు: పంట కాలువల్లో తూడు, గుర్రపు డెక్క, పిచ్చి మొక్కల తొలగింపుకు మందు పిచికారీ చేయడం దారుణమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో వీటిని మనుషులతో గట్లపైకి తీసుకురావాల్సింది పోయి, మందు పిచికారీ వల్ల పంట కాలువల్లో నీరు కలుషితమవుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో కాలువల్లో మందు పిచికారీ చేయించి, ఎండిపోయిన తూడు, గుర్రపుడెక్కను బయటకు తీయిస్తారు. అయితే వర్షాకాలంలో పంట నీటిలో ఈ విధంగా చేయడం సరైన పద్ధతి కాదని పలువురు రైతులు, స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మనుషులతో తూడు తొలగించే చర్యలు చేపట్టే విధంగా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఆకివీడు: స్థానిక పడాల వారి వీధిలో నివసిస్తున్న అమ్మాజీ, సత్తివాడ జానకీ పాతగొడవల నేపథ్యంలో శుక్రవారం ఇరువురూ ఘర్షణపడటంతో వారిచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సత్యనారాయణ చెప్పారు. వారితో పాటు మచ్చా తులసి, ఎస్కే షబానా, ఇస్మాయేలులపై కేసు నమోదు చేశామని చెప్పారు.

పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ చూపాలి

పెనుగొండ: పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీపీఓ రామ్‌నాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పెనుగొండ పంచాయతీలో పంచాయతీ పార్కును పరిశీలించారు. అనంతరం పంచాయతీలో సిబ్బందితో పారిశుధ్య నిర్వహణపై సమీక్షించారు. తాగునీటి సరఫరలోనూ ఎటువంటి అంతరాయం, ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, పెనుగొండ సొసైటీ చైర్మన్ నక్కా వేద వ్యాస శాస్త్రి, డిప్యూటీ ఎంపీడీఓ సూర్యప్రకాష్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

108లో ప్రసవం

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం ముత్యాలపల్లి మోడి గ్రామానికి చెందిన బొక్కా ఏడుకొండలు కుమార్తె దుర్గా భవాని 108 అంబులెన్సులో శుక్రవారం ప్రసవించింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు. తెల్లవారు జామున పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారమిచ్చారు. ఈ అంబులెన్సులో భవానిని నరసాపురం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువై 108 అంబులెన్సులోనే ప్రసవించింది. మెడికల్ టెక్నీషియన్ సంజీవ్‌కుమార్ సేవలు అందించారు.

బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన

యలమంచిలి: జిల్లా బాలల సంరక్షణ యూనిట్ (మిషన్ వాత్సల్య) ఆధ్వర్యంలో శుక్రవారం దొడ్డిపట్ల హైస్కూల్లో బాలల హక్కులు, చట్టాలు, సంక్షేమ పథకాలు, బాల్య వివాహాలు వలన కలిగే నష్టాలు, పోక్సో యాక్ట్ – 2012 పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూషనల్ కేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి.మమతాశ్రీ విద్యార్థులకు మంచి నడవడిక, నైతిక విలువలను పెంపొందించుకునే విధానాన్ని గురించి నీతి కథలు ద్వారా వివరించారు. హెచ్ఎం రామేశ్వరపు సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ఎన్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

అక్రమంగా వేసిన ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలి


విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్న పాములపర్రు దళితులు

ఉండి: పాములపర్రు దళితుల శ్మశానవాటికలో ఆక్వారైతు,విద్యుత్ అధికారులు కలసి అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే తొలగించాలని పాములపర్రు దళితులు అధికారులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ జిల్లా అధికారులకు పాముపర్రు గ్రామానికి చెందిన దర్శి దేవానందం ఆధ్వర్యంలో దళితులు పాములపర్రు శ్మశాన వాటికలో అక్రమంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాముపర్రు,కోలమూరు సరిహద్దులో వున్న దళితుల శ్మశానవాటికలో తాటిపట్టి నాగులు అనే ఆక్వారైతు అక్రమంగా ఎటువంటి అనుమతి లేకుండా సాగు చేస్తున్న ఆక్వా చెరువు కోసం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, మీటరు, విద్యుత్ ఫ్యూజులు వంటి పరికరాలు ఏర్పాటు చేశాడని తెలిపారు. ఈ విషయమై ఈ నెల 4న విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అయితే దీనిపై ఎలాంటి స్పందన లేకపోవడంతో శుక్రవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో మరోసారి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దర్శి దేవానందం, పంచాయితీ వార్డు సభ్యుడు దర్శి సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


భీమవరం విద్యాశాఖ కార్యాలయం వద్ద వినతి పత్రం అందచేస్తున్న దృశ్యం


భీమవరం: మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ కార్మికులకు బిల్లుల రూపంలో వచ్చేది రూ.2 వేలు అయితే రూ. 4 వేలు ఖర్చు అవుతుందని ఇలా అయితే ఎలా పనిచేయాలని సీఐటీయూ నాయకులు ఇంజేటి శ్రీనివాస్, ఎం ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం భీమవరంలో విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు చాలీచాలని వేతనాలతో నెల నెలా అందని వేతనాలు బిల్లులతో అప్పుల పాలవుతున్నారన్నారు. నిత్యావసరాల ధరలన్నీ పెరిగి, ఖర్చులు పెరిగినప్పటికీ ప్రభుత్వం వీరి కష్టాలను గుర్తించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రైవేటు ఏజెన్సీల ద్వారా భోజనాన్ని వండి అన్ని స్కూల్స్‌కు సరఫరా చేసే విధానాన్ని ప్రభుత్వం అమలుకు ప్రయత్నం చేస్తుందని, దీని వల్ల మధ్యాహ్న భోజన కార్మికులు 20 ఏళ్లగా చేస్తున్న పనిని కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కె.సరస్వతి, కొండేటి ఆశీర్వాదం, మద్ద ఝాన్సీ, రావాడ మారెమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోతుల నిలయంగా గణపవరం రోడ్డు


ఉండి గణపవరం రోడ్డులో ప్రమాదరకంగా ఉన్న గొయ్యి

ఉండి: ఉండి సెంటర్ నుంచి వెళ్లే గణపవరం రహదారి గోతులకు నిలయంగా మారిపోయింది. రోడ్డు అధ్వానంగా ఉన్నా ఏ అధికారి గానీ ప్రజాప్రతినిధి గానీ కనీసం మరమ్మతులు కూడా చేయించేందుకు కూడా ముందుకు రాకపోవడంతో గమనార్హం. గోతుల వల్ల పగటి పూట ఎంతో మంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారంటే రాత్రి వేళల్లో పరిస్థితి ఎలా ఉంటుందో? అర్థం చేసుకోవచ్చు. ఈ రోడ్డుపై పడిన ఓ భారీ గోతిలో వాహనదారులు పడి ప్రమాదాలకు గురికావడం గమనించిన ఓ పుణ్యాత్ముడు కొన్నిపుల్లలు నిలబెట్టి దానికి ఎర్రని టవల్ సంచి చుట్టాడు. దీనివల్ల వాహదారులు తప్పించుకుని వెళ్లగలుగుతున్నారు. గణపవరంలో రోడ్డులో మలుపులు ఎక్కువగా ఉండడం, ఈ రోడ్డులో పెద్ద పెద్ద గోతులు పడడంతో ఇటీవల రోడ్డు ప్రమాదాలు కూడా పెరిగిపోయాయని వాహనదారులు వాపోతున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


ర్యాలీలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని దగ్గులూరు గ్రామంలో నిర్మాణం మధ్యలో ఆపేసిన మెడికల్ కళాశాల పనులను వెంటనే ప్రారంభించాలని జిల్లా సహాయ కార్యదర్శి జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అయిన గురుకుల పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించాలన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ రూ.6600 కోట్లు బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్స్ కోసం శాశ్వత భవనాలు నిర్మాణం చేయాలన్నారు. జీఓ 77 ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కల్పించాలన్నారు. అంతేకాకుండా అర్హులైన ప్రతీ విద్యార్థికి రూ.15 వేలు తల్లికి వందనం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగేంద్ర, గణేష్, భాను, నవీన్, శేఖర్, సత్యసాయి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై పృథ్వీ

పాలకొల్లు సెంట్రల్: నేటి సమాజంలో పెరిగిన శాస్త్ర సాంకేతిక రంగాలను సద్వినియోగం చేసుకుని సమాజాభివృద్ధికి పాటుపడాల్సిన వారు నేరగాళ్లగా మారి దుర్వినియోగం చేస్తు సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని పట్టణ ఎస్సై జి.పృథ్వీ అన్నారు. శుక్రవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలు జాగ్రత్తలు అనే అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై పృథ్వీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో సైబర్ నేరాలు కూడా పెరిగాయన్నారు. దీనికి కారణం మనిషి జీవన విధానమే కారణమన్నారు. సోషల్ మీడియాలో పెడుతున్న రకరకాల పోస్టులతో సైబర్ నేరగాళ్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మన వద్ద ఉన్న సంపదను దోచుకుంటున్నారన్నారు. కొన్ని సందర్భాలలో బ్లాక్‌మెయిల్‌కు సిద్ధపడుతున్నారన్నారు. వీటిని అరికట్టాలంటే సోషల్ మీడియా గురించి పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఏది కనిపిస్తే దానిని క్లిక్ చేయకుండా జాగ్రత్తలుతీసుకుని దానిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, ఏఎస్సై మార్‌లింగం, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, కె.భద్రాచలం, డాక్టర్ వి.యామిని తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మానవత శాంతి ర్యాలీ



భీమవరంలో మానవత సంస్థ శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కలిసిపూడిలో మాట్లాడుతున్న నాయకులు

భీమవరం: మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం భీమవరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని అమరవీరుల స్మృతి వనం వద్ద ర్యాలీని వన్‌టౌన్ ఎస్సై బీవై కిరణ్ కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ మానవత సంస్థ చేస్తున్న సేవాకార్యక్రమాలని కొనియాడారు. మానవత సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు, అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో వివిధ రకాల సేవాకార్యక్రమాలతోపాటు విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. అనంతరం బిటెక్ విద్యార్థి ఎంఎస్ఎల్ త్రిపురసుందరి రూ.30 వేలు, ఇంటర్ విద్యార్థులు చిలకపాటి జాన్‌ప్రణయ్, వై.అవినాష్‌లకు ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున నగదు అందజేశారు. అలాగే వృద్ధ కళాకారుడు కె.మావుళ్లకు వైద్యఖర్చులకు రూ. రూ. 10 వేలు కలిదిండి మురళీకృష్ణంరాజు, డాక్టర్ బుద్ధరాజు దీప్తి, చింతలపాటి రామకృష్ణంరాజు, కారుమూరి నర్సింహమూర్తి సహకారంతో అందించామన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై వంశీ, సంస్థ డైరెక్టర్ పెన్మెత్స రామ్మోహన్ వర్మ, ఇందుకూరి ప్రసాదరాజు, సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ఎన్ రాజు, కోశాధికారి గ్రంధి కుమార వెంకటేశ్వర వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలిసిపూడిలో..

ఉండి: మానవాళి మనుగడ సాగించాలంటే ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా చేపట్టి మొక్కలు నాటాలని మానవతా సేవాసంస్థ మండలాధ్యక్షుడు డాక్టర్ గాదిరాజు సుబ్బరాజు అన్నారు. ఆ సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కలిసిపూడి మెయిన్ స్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కో చైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు, కోశాధికారి కేటీఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ సేవాసంస్థలో అనేక మంది చేరి చేయూతనివ్వాలని అన్నారు. దాత వేంద్ర రాజేశ్వరి, హెచ్ఎం గోగులమండ ఎలీషా, కె.రవివర్మ పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు


భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ ఆలయం వద్ద వరలక్ష్మి వ్రతాలు చేస్తున్న మహిళలు


ఆకివీడు: పెద్దింటి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు


భీమవరం అర్బన్: యనమదుర్రులో ప్రత్యేక అలంకరణలో శక్తీశ్వర స్వామి

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో ఉన్న శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ మహాలక్ష్మి ఉత్సవమూర్తిని అలంకరించిన తీరు భక్తులను విశేషం గా ఆకట్టుకుంది. వరలక్ష్మి వ్రతాలను మద్దిరాల మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహించారు. వ్రతాల్లో పాల్గొన్న సుమారు 1500 మంది భక్తులకు శ్రీ మావుళ్లమ్మ వారి పుట్టింటి వారుగా పేరున్న మెంటే వంశస్తులు శేషవస్త్రం అందించారు. సుమారు 3000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించామని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

గునుపూడిలో..

భీమవరం: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు భక్తిభావంతో ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం పట్టణం గునుపూడిలోని శ్రీఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్ల దేవస్థానంలో శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలను ఆయన ప్రారంభించారు. ఆలయ ఈఓ గొట్టుముక్కల సీతారామరాజు మాట్లాడుతూ 800 మంది మహిళలతో సామూహిక వరలక్ష్మి వ్రత పూజలను నిర్వహించామన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

ఆకివీడులో..

ఆకివీడు: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం కావడంతో అమ్మవార్లను లక్ష్మీదేవిగా అలంకరించి పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో వాసవీ మాతను గాజులతో అలంకరించి మహిళలు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ గొంట్లా గణపతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కార్యదర్శి కాకర్ల రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు గ్రామంలో ఉన్న శ్రీ పార్వతి సమేత శక్తీశ్వర స్వామి వార్లకు శ్రావణమాసంలో చివరి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు మద్దిరాల సత్యనారాయణ మూర్తి, కొడమంచిలి తమ్మిరాజులు స్వామి వార్లకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చనలతో ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. అనంతరం వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ డి. కృష్ణంరాజు పర్యవేక్షించారు.

రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిన కూటమి


సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహమూర్తి

భీమవరం: రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చి గీత కార్మికులను రోడ్డున పడేస్తున్నారని ఏపీ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం భీమవరం సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి అధ్యక్షతన నిర్వహించిన కల్లు గీత కార్మిక సంఘం జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. రాజకీయ పార్టీలు కల్లుగీత కార్మికులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారు తప్ప గీతన్నల వృత్తి రక్షణ, భద్రతకు ఎలాంటి చర్యలను తీసుకోవడంలేదని మండిపడ్డారు. మద్యం పాలసీ వల్ల గీత వృత్తి నిర్వీర్యమైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఊరూర విచ్చలవిడిగా బెల్ట్‌షాపులను ఏర్పాటుచేయడంతో గీత వృత్తికి తీవ్ర విఘాతం ఏర్పడిందని రాత్రి, పగలు తేడా లేకుండా మద్యం విక్రయాలు చేస్తున్నారని అక్రమ బెల్టు షాపులు అరికట్టేవరకు ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని నర్సింహమూర్తి హెచ్చరించారు. ఈనెల 30న ఎక్సైజ్ సూపర్నింటెండెంట్‌కు చెప్పుకుందాం రండి అంటూ ఎక్సైజ్ జిల్లా కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించనున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లిపూడి ఆంజనేయులు, ప్రజానాట్య మండల జిల్లా కార్యదర్శి షేక్ వలి తదితరులు పాల్గొన్నారు.

సర్వే సక్రమంగా నిర్వహించాలి

పెనుగొండ: ఫేస్ టూ ఫేస్ సర్వే సక్రమంగా నిర్వహించాలని సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి సూచించారు. శుక్రవారం చెరుకువాడలో నిర్వహిస్తున్న ఫేస్ టూ ఫేస్ సర్వేను పర్యవేక్షించారు. సర్వేలోని అన్ని అంశాలను నమోదు చేయాలన్నారు. ఆమె వెంట కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.